సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 14 । డిసెంబర్ । 2023



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



అలరించిన మణిపురి నృత్యం

పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన మణిపూర్ సత్యసాయి భక్తులు జానపద నృత్యాలతో ఆహూతులను అలరించారు.

IIలో



జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి స్వల్పంగా పెరిగింది. ఆగ్నేయం దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

వైఎస్సార్ విద్యార్థి విభాగంలో పలువురికి చోటు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీలో ఉమ్మడి అనంతపురం జిల్లా నాయకులకు చోటు దక్కింది. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీ సభ్యుల వివరాలను పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం మీడియాకు వెల్లడించింది. విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మాదిరెడ్డి నరేంద్రరెడ్డి (అనంతపురం), కార్యదర్శులుగా ఎస్‌కే షెక్షావలి (అనంతపురం), బూచిపల్లి రఘుకుల తేజేష్‌రెడ్డి (శ్రీసత్యసాయి జిల్లా), సహాయ కార్యదర్శులుగా బంగారు వంశీ (అనంతపురం), వేముల అమర్‌నాథ్‌రెడ్డి (శ్రీసత్యసాయి జిల్లా), అఫీషియల్ స్పోక్స్‌పర్సన్‌గా గంగలకుంట కేశవర్ధన్‌రెడ్డి (అనంతపురం)ని నియమించారు.

బాలింత ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నం చేస్తున్న బాలింతను రక్షిస్తున్న బంధువులు

పెనుకొండ రూరల్: రెండో కాన్పులోనూ ఆడపిల్ల పుట్టడంతో భర్త ముఖం చాటేశాడు. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న బాలింత ఆత్మహత్యాయత్నం చేసింది. సకాలంలో అప్రమత్తమైన బంధువులు ఆమెను కాపాడారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి వివరాలు... పెనుకొండ మండలం శెట్టిపల్లికి చెందిన శ్రావణీబాయికి అడదాకులపల్లికి చెందిన మహేష్‌నాయక్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లి సమయంలో కట్నం కింద రూ.50 వేలు, మూడు తులాల బంగారాన్ని శ్రావణి తల్లిదండ్రులు ఇచ్చారు. ఏడాది పాటు కాపురం సజావుగా సాగినా... మొదటి ప్రసవంలో ఆడపిల్ల పుట్టడంతో అదనపు కట్నం కావాలంటూ భర్త వేధింపులకు గురి చేస్తూ వచ్చాడు. రెండో కాన్పులోనూ ఆడపిల్ల పుట్టడంతో ముఖం చాటేశాడు. దీంతో తీవ్ర మనోవేదనకు లోనైన శ్రావణి మంగళవారం ఉదయం వ్యవసాయ బావిలో దూకేందుకు సిద్ధమైంది. వెంటనే గమనించిన సమీప బంధువులు అప్రమత్తమై ఆమెను పక్కకు లాగారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

నేడు చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాక



మడకశిర: రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ముఖ్య కార్యదర్శి సునీత గురువారం మడకశిరలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా ఆమె స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఉదయం 10 గంటలకు ధర్మవరం నియోజకవర్గానికి చెందిన చేనేత సొసైటీల సభ్యులు, వీవర్స్‌తో సమావేశమవుతారని సంబంధిత అధికారులు తెలిపారు. అదే విధంగా ఉదయం 10.45 గంటలకు విద్యార్థులతో సమావేశమై టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో ఉన్న అవకాశాలను వివరిస్తారని వెల్లడించారు.

మరింత పవర్‌ఫుల్ !

- ఇక్కడ కనిపిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ బత్తలపల్లి మండలం అప్రాచెరువులో రూ.2కోట్ల నిధులతో నిర్మించారు. ఇటీవలే ప్రారంభించారు. ఈ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం కావడంతో అప్రాచెరువుతో పాటు గంటాపురం, జ్వాలాపురం, చెన్నపట్నం, వరదాపురం, సంగాల, విశ్వనాథపురం, తమ్మాపురం గ్రామాల గృహ, వ్యవసాయ కనెక్షన్లకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతోంది.



- లో ఓల్టేజీ సమస్యలకు చెక్
- ఉమ్మడి జిల్లాకు 37 అదనపు సబ్ స్టేషన్లు
- రూ.81 కోట్ల నిధుల మంజూరు
- ఇప్పటికే 16 సబ్ స్టేషన్లు ప్రారంభం
- మరో 21 సబ్ స్టేషన్ల నిర్మాణాలు 90 శాతం పూర్తి

ఉమ్మడి జిల్లాలో విద్యుత్ కనెక్షన్ల వివరాలు

డివిజన్	గృహ కనెక్షన్లు	కమర్షియల్ కనెక్షన్లు	వ్యవసాయ కనెక్షన్లు
అనంతపురం	2,13,994	30,452	33,600
అనంతపురం రూరల్	1,32,171	13,425	58,906
గుత్తి	1,97,843	22,616	48,594
హిందూపురం	1,98,574	19,662	42,282
కదిరి	1,88,740	1,71,19	51,246
కళ్యాణదుర్గం	1,62,430	13,698	75,543
మొత్తం	10,93,752	1,16,982	3,10,171

అనంతపురం టౌన్: ఉమ్మడి జిల్లాలో నాణ్యమైన విద్యుత్ సరఫరా దిశగా ఆ సంస్థ అడుగులు వేస్తోంది. లో ఓల్టేజీ సమస్యకు పూర్తిస్థాయిలో శాశ్వత పరిష్కారం చూపేందుకు అదనపు విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 261 సబ్ స్టేషన్ల ద్వారా వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. కొన్ని సబ్ స్టేషన్లకు సుదూర ప్రాంతాల్లో ఉన్న గ్రామాలకు లో ఓల్టేజీ సమస్య ఏర్పడుతోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఆరు విద్యుత్ డివిజన్ల పరిధిలో 37 అదనపు సబ్ స్టేషన్ల నిర్మాణం కోసం రూ.81.4కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో నిర్మాణాలు పూర్తయిన 16 సబ్‌స్టేషన్లను అధికారులు ప్రారంభించారు. మిగిలిన 21 సబ్ స్టేషన్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో సాగుతున్నాయి. ఈ నెలాఖరులోపు 100 శాతం పనులు పూర్తయ్యే విధంగా కాంట్రాక్టర్లకు విద్యుత్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వాటి నిర్మాణ పనులు పూర్తయితే జిల్లా వ్యాప్తంగా వినియోగదారులకు లో ఓల్టేజీ సమస్య లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంది.

జనవరిలో అందుబాటులోకి



నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అదనపు సబ్ స్టేషన్లను నిర్మిస్తున్నాం. ఇప్పటికే 16 సబ్ స్టేషన్ల పనులు పూర్తి కావడంతో ఆయా ప్రాంతాల ప్రజలకు లో ఓల్టేజీ సమస్య లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నాం. మిగిలిన 21 సబ్ స్టేషన్లు ఈ నెలాఖరులోపు పూర్తి చేసి వచ్చే జనవరి నెలలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

– సురేంద్ర, విద్యుత్ శాఖ, ఎస్ఈ

- అనంతపురం రూరల్ మండలం కొడిమి పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో దాదాపు రూ.2.5 కోట్ల వ్యయంతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నారు. నెలాఖరులోపు నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేనున్నారు. ఈ సబ్‌స్టేషన్ నుంచి అనంతపురం రూరల్ మండలం కొడిమి, ప్రజా చైతన్యకాలనీ, జర్నలిస్టు కాలనీ, నరసనాయనికుంట, ఎ.నారాయణపురం, కూడేరు మండలం గొటుకూరు, బ్రాహ్మణపల్లి, రామచంద్రాపురం, లెప్రసీ కాలనీ తదితర గ్రామాల గృహ, వ్యవసాయ కనెక్షన్లకు అంతరాయం లేకుండా విద్యుత్ అందనుంది.



రేపు బుక్కపట్నంలో జాబ్‌మేళా

పుట్టపర్తి టౌన్: నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈనెల 15న బుక్కపట్నం డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూం, కళాశాల ప్రిన్సిపాల్ ముక్బల్ హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, బుక్కపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో 15వ తేదీ ఉదయం 9 గంటలకు నిర్వహించే జాబ్‌మేళాలో పాల్గొనాలనుకునే వారు బయోడేటాతో పాటు ఆధార్‌కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు. జాబ్‌మేళాలో వివిధ కంపెనీలు పాల్గొంటున్నాయని, హైదరాబాద్‌లో 70 ఉద్యోగాలకు, జిల్లాలో 71 ఉద్యోగాలకు ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పూర్తి వివరాలకు 79815 41994 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

అసాంఘిక శక్తులను ఉపేక్షించం

- శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం
- ఎస్పీ మాధవరెడ్డి



నల్లమాడ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి/నల్లమాడ: శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులను ఉపేక్షించే ప్రసక్తే లేదని ఎస్పీ మాధవరెడ్డి తేల్చి చెప్పారు. బుధవారం ఆయన బుక్కపట్నం, నల్లమాడ పోలీస్ స్టేషన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. స్టేషన్ల పరిధిలో నమోదైన కేసులు, దర్యాప్తు తీరు, సీజ్ చేసిన వాహనాల గురించి అడిగి తెలుసుకున్నారు. తొలుత బుక్కపట్నం స్టేషన్‌కు వెళ్లిన ఎస్పీ మాధవరెడ్డి మహిళా పోలీసులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఎన్నికలు సమీపిస్తున్నందున మహిళా పోలీసులు గ్రామాల్లోని సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు చేరవేయాలన్నారు. స్టేషన్ ఆవరణలో పచ్చదనం ఉండేలా మొక్కలు పెంచాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. శాంతిభద్రతలను పరిరక్షణ అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా ఉంచామన్నారు. ప్రజలు, పోలీసుల మధ్య మంచి సంబంధాలు నెలకొల్పేందుకు 'పల్లె నిద్ర'బాగా ఉపయోగపడుతోందన్నారు. జూదం, మట్కా, మద్యం అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించబోమన్నారు. అనంతరం ఎస్పీ నల్లమాడ పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఏదైనా సమస్యతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు పోలీసులు అండగా ఉండాలన్నారు. ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ అధికారులు, మహిళా పోలీసులు తరచూ పాఠశాలలు, కళాశాలలను సందర్శిస్తూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు తెలియజేయాలన్నారు. రౌడీ షీటర్ల కార్యకలాపాలపై నిఘా కొనసాగించాలన్నారు. కర్ణాటక సరిహద్దు చెక్ పోస్టుల్లో భద్రత కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. అనంతరం మహిళా పోలీసులతో సమావేశమయ్యారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఎస్పీ వెంట పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్, నల్లమాడ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, పుట్టపర్తి రూరల్ సీఐ రామయ్య, ఓడీ చెరువు, అమడగూరు, బుక్కపట్నం ఎస్‌ఐలు మల్లికార్జునరెడ్డి, కృష్ణమూర్తి, నరసింహుడు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి నిరోధకులను తరిమికొడదాం

- ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా అభివృద్ధి ఆగదు
- ఓట్ల కోసం కాదు ప్రజల రుణం తీర్చుకునేందుకు పనిచేస్తున్నా
- ధర్మవరాన్ని అభివృద్ధిలో అగ్రపథాన నిలపడమే లక్ష్యం
- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



అభివృద్ధికి అండగా ఉందాం అంటూ ఎమ్మెల్యేతో కలిసి ర్యాలీలో భారీగా పాల్గొన్న ధర్మవరం వాసులు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం: ''నన్ను నమ్మి ఓట్లు వేసిన ప్రజల రుణం తీర్చుకునేందుకు పనిచేస్తున్నా...ధర్మవరం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రపథాన నిలపడమే నా లక్ష్యం. ఓట్ల కోసం స్వార్థ రాజకీయాలు చేయడం నాకు తెలియదు...తెలిసిందల్లా అభివృద్ధి చేయడం, ప్రజలతో మమేకం కావడమే..ప్రతిపక్షాలు ఎంతగా అడ్డుకుంటే అంతకు రెట్టింపు అభివృద్ధి చేసి చూపిస్తా'' అని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. ధర్మవరం నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై కోర్టుకు వెళ్లి అడ్డుకుంటున్న ప్రతిపక్ష పార్టీల వైఖరిని నిరసిస్తూ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో 'అభివృద్ధి నిరోధకులను తరిమికొడదాం' అన్న పిలుపుతో బుధవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎస్‌బీఐ కాలనీ నుంచి ప్రారంభమైన ర్యాలీ కాలేజ్ సర్కిల్, కళాజ్యోతి సర్కిల్ మీదుగా పీఆర్‌టీ సర్కిల్ వరకూ కొనసాగింది. వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొని మద్దతు తెలిపారు.

రూ.5 వేలకోట్లతో అభివృద్ధి పనులు..

గడచిన నాలుగున్నరేళ్లలో ధర్మవరం నియోజకవర్గంలో రూ.5 వేల కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే కేతిరెడ్డి తెలిపారు. ర్యాలీ అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ఒక్క ధర్మవరం పట్టణంలోనే 14 వేల మందికిపైగా ఇళ్లు మంజూరు చేశామన్నారు. కాయగూరల మార్కెట్‌ను సర్వాంగ సుందరంగా నిర్మించామని, మున్సిపాలిటీ పరిధిలో శివారు ప్రాంత కాలనీలకు సైతం మౌలిక వసతులు కల్పించామన్నారు. మదర్ అండ్ చైల్డ్ ఆస్పత్రి నిర్మాణం పూర్తి, తాడిమర్రి ప్రధాన రోడ్డు విస్తరణ, శివానగర్ ఫోర్‌లేన్ ఆర్‌ఓబీ నిర్మాణానికి భూమిపూజ, బత్తలపల్లి నుంచి బైపాస్, ఫోర్‌లేన్ రోడ్డు, 'నాడు–నేడు'తో విద్యాసంస్థల్లో మౌలిక వసతులు, ఆస్పత్రులు, రహదారుల అభివృద్ధి..ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉన్నాయన్నారు. కానీ ప్రతిపక్ష పార్టీల నాయకులకు ఇవేమీ కనిపించడం లేదన్నారు. కేవలం తమ స్వార్థం కోసం కుట్రలు చేసి అభివృద్ధి నిరోధకులుగా మారారని ఎమ్మెల్యే ధ్వజమెత్తారు.

ఆర్‌ఓబీకి అడ్డుపడుతున్న ప్రతిపక్షాలు..

ధర్మవరంలో ఏళ్ల తరబడి నెలకొన్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కదిరిగేట్ వద్ద రూ.80 కోట్ల వ్యయంతో ఫోర్‌లేన్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు సిద్ధం కాగా, ప్రతిపక్ష పార్టీల నాయకులు సైందవుల్లా అడ్డుకుంటున్నారన్నారు. 132 మంది నిర్వాసితుల్లో 15 మందికి 2013 భూసేకరణ చట్టం ప్రకారం రూ.11.5 కోట్ల పరిహారం అందించామన్నారు. పరిహారం తీసుకున్న వారి ఇళ్లను మాత్రమే తొలగించామన్నారు. పరిహారం తీసుకోని వారి ఇళ్లని ముట్టుకోవద్దని చెప్పామన్నారు. తాము ఇంత చిత్తశుద్ధితో ముందుకు వెళ్తుంటే ప్రతిపక్షాలు నిర్వాసితులను రెచ్చగొడుతూ కోర్టుల్లో కేసులు వేయించి అభివృద్ధి జరగకుండా కుట్ర పన్నుతున్నారన్నారు. పోనీ వారి హయాంలో చేసిన ఒక్క అభివృద్ధి పనేదైనా ఉందేమో చెప్పమని ప్రశ్నించారు. ఎవరెంతగా అడ్డుకున్నా రానున్న రోజుల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ధర్మవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలుపుతామన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు అభివృద్ధికి అడ్డుపడటం మాని ప్రజలకు మంచి జరిగే కార్యక్రమాలకు కలిసి రావాలని హితవు పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్ బేగం, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నీలూరి ప్రకాష్‌తో పాటు 40 వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

రైతులను ఉదారంగా ఆదుకోండి

- జిల్లాలోని 73,566 హెక్టార్లలో పంట నష్టం
- కరువు తీవ్రత కేంద్రానికి తెలియజేసి సాయం అందేలా చూడండి
- కేంద్ర బృందాన్ని కోరిన ఎమ్మెల్యేలు శంకరనారాయణ, తిప్పేస్వామి
- మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో పర్యటించిన కేంద్ర బృందం సభ్యులు
- పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందేలా చూస్తామని హామీ



పరిగి మండలం మోదాలో ఎండిపోయిన పంటను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు, చిత్రంలో ఎమ్మెల్యే శంకరనారాయణ, జేసీ చేతన్



మడకశిర మండలం బుళ్లసముద్రం గ్రామంలో దెబ్బతిన్న కంది పంటను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు, చిత్రంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి

పరిగి/మడకశిర/మడకశిర రూరల్: తీవ్ర వర్షాభావంతో ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన జిల్లా రైతులను కేంద్రం ఉదారంగా ఆదుకునేలా నివేదికలు అందజేయాలని ఎమ్మెల్యేలు శంకరనారాయణ, తిప్పేస్వామి కేంద్ర బృందం సభ్యులను కోరారు. జిల్లాలో 21 మండలాలను కరువు జాబితాలో చేర్చిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం (ఐఎంసీటీ) బృందం బుధవారం జిల్లాలో పర్యటించింది. సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ అండ్ మానిటరింగ్ అప్రైజల్ పి.దేవేంద్రరావు, డెయిరింగ్ రీజనల్ ఫాడర్‌స్టేషన్ ఎస్‌టీఏ అంజు బసేరా, ఎంఎన్‌సీఎఫ్‌సీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్‌తో కూడిన సభ్యుల బృందం పరిగి, మడకశిర, అమరాపురం, గుడిబండ మండలాల్లో పర్యటించింది. క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని పరిశీలించి రైతులతో ముఖాముఖి మాట్లాడి పంటలసాగుకు పెట్టిన పెట్టుబడులు, వర్షాభావంతో కలిగిన నష్టాన్ని తెలుసుకుంది. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఏడీఏలు అల్తాఫ్ ఆలీ, కృష్ణయ్య, డీఏహెచ్‌ఓ శుభదాస్, డీడీఏ పెంచలయ్య, డీహెచ్‌ఓ చంద్రశేఖర్, డీఎస్‌ఓ శోభారాణి, ఏపీ ఎంఐపీ పీడీ సుదర్శన్, సీపీఓ విజయ్‌కుమార్, డీవైఎస్‌ఓ మల్లికార్జున, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రషీద్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీడీ విజయ్‌ప్రసాద్, ఏపీడీ శివానందనాయక్, ఇరిగేషన్ డీఈ లక్ష్మీనారాయణ, తహసీల్దారు సౌజన్యలక్ష్మి, ఎంపీడీఓ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బృందం పర్యటన సాగిందిలా...

- ఎమ్మెల్యే శంకరనాయణ, జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డితో కలిసి కేంద్ర బృందం సభ్యులు తొలుత మోదా రెవెన్యూ పరిధిలోని అశ్వర్థమ్మ అనే మహిళా రైతు పొలంలో సాగు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. అనంతరం రైతులతో పాటు ప్రజాప్రతినిధులు, రైతు సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు.
- అనంతరం మడకశిర మండలంలోని బుళ్లసముద్రం, హరేసముద్రం గ్రామాల వద్ద రైతులు సాగు చేసిన కందిపంటను పరిశీలించారు. అదే విధంగా కదిరేపల్లి గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఆ తర్వాత గుడిబండ మండలంలోని కేకాతి, గుడిబండ, అమరాపురం మండలంలోని వలస గ్రామం వద్ద కంది పంటను పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి వారి కష్టాలను తెలుసుకున్నారు. అంతకుమునుపు బుళ్లసముద్రం వద్ద స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి కేంద్ర బృందం సభ్యులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాన్ని సమర్పించారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకునే విధంగా కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపాలని వారిని ఎమ్మెల్యే కోరారు.

పంట నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం..

పంట నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందేలా కేంద్రానికి నివేదిక అందజేస్తామని కేంద్ర బృందానికి నేతృత్వం వహిస్తున్న సెంట్రల్ వాటర్ కమిషన్ డైరెక్టర్ అండ్ మానిటరింగ్ అప్రైసల్ పి.దేవేంద్రరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కరువు జాబితాలో చేర్చిన మండలాల్లో కేంద్ర కరువు బృందం సభ్యులు పర్యటిస్తున్నారన్నారు. కరువు పీడిత ప్రాంతాల్లో పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు రైతులతో మాట్లాడి వారి సాదకబాధలను తెలుసుకున్నామన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోని 73,566 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు అధికారులు నివేదిక పంపారని, తప్పకుండా రైతులందరికీ న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, వ్యవసాయ పరికరాలు, యంత్ర సాయం కోసం రైతులు కోరిన సాయాన్ని సైతం కేంద్రానికి నివేదిస్తామని పేర్కొన్నారు.

ఆదుకోవాలని కోరాం..

జిల్లా రైతులను ఉదారంగా ఆదుకోవాలని జిల్లా యంత్రాంగం తరపున కోరినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుబ్బారావు తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడి పెద్ద ఎత్తున పంట నష్టం జరిగినట్లు కేంద్ర కరువు బృందం సభ్యుల దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ఇప్పటికే పంట నష్ట పరిహారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపినట్లు కేంద్ర బృందానికి వివరించామన్నారు. ప్రధానంగా వేరుశనగ, కంది, మొక్కజొన్న, చిరుధాన్యాల పంటలు దెబ్బతిన్నట్లు వారికి వివరించామన్నారు. కేంద్ర బృందం పర్యటనతో జిల్లా రైతులకు తప్పకుండా మంచి జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

తక్షణమే సాయమందించాలి

- కేంద్ర బృందాన్ని కోరిన శంకరనారాయణ

తీవ్ర అనావృష్టితో పంటలను కాపాడుకోలేక రైతులు నష్టపోయారని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే రైతుల కష్టాలను తీర్చేందుకు తగిన సాయమందించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ కేంద్ర బృందాన్ని కోరారు. పరిగి మండలం మోదాలో కేంద్ర బృందం సభ్యులతో మాట్లాడిన ఆయన... ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావం కారణంగా రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని వెల్లడించారు. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతాంగం తీవ్ర నష్టాన్ని చవిచూశారన్నారు. రైతులకు మేలు జరిగేలా కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందించి ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా హంద్రీనీవా మడకశిర బ్రాంచ్ కెనాల్ మోదా గ్రామం మీదుగా ఉన్నప్పటికీ మోదా రెండు చెరువులకు కృష్ణా జలాలను సరఫరా చేయడానికి సబ్ కెనాల్ నిర్మాణానికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వమే మంజూరు చేయడానికి సిఫార్సు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసేలా నివేదించాలని కోరారు.

రూ.286.33 కోట్ల పరిహారమివ్వాలి

- కేంద్ర బృందానికి ఎమ్మెల్యే తిప్పేస్వామి వినతి

మడకశిర నియోజకవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో పంట నష్ట పోయిన రైతులకు రూ.286.33 కోట్ల పంట నష్ట పరిహారాన్ని మంజూరు చేయాలని కేంద్ర కమిటీ సభ్యులను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి కోరారు. బుధవారం ఆయన కేంద్ర బృందం సభ్యులను కలిసిన అనంతరం 'సాక్షి'తో మట్లాడారు. మడకశిర నియోజకవర్గంలో 47,157 మంది రైతులు 19,702 హెక్టార్లలో పంటలు నష్టపోయినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉదారంగా ఆదుకునేలా చూడాలని కేంద్ర బృందం సభ్యులకు సమర్పించిన వినతి పత్రంలో కోరినట్లు తెలిపారు. అదే విధంగా పంటరుణాలపై వడ్డీ మాఫీ, పంట రుణాలను రీషెడ్యూల్, డ్రిప్‌పై 100 శాతం సబ్సిడీ, 125 మైనర్ ఇరిగేషన్ చెరువుల అభివృద్ధికి రూ.200 కోట్ల నిధులను మంజూరు చేయాలని కోరినట్లు వెల్లడించారు. రేరింగ్‌షెడ్లపై సబ్సిడీ పెంచి పట్టు రైతులను ఆదుకోవాలని కేంద్ర బృందాన్ని కోరినట్లు తెలిపారు.

అలరించిన మణిపురి జానపద నృత్యం





పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన మణిపూర్ సత్యసాయి భక్తులు బుధవారం ఉదయం సాయికుల్వంత్ మందిరంలో నిర్వహించిన జానపద కళాఉత్సవం ఆకట్టుకుంది. లాయ్ హరోబా పేరుతో సాగిన జానపద నృత్య ప్రదర్శన ఆ ప్రాంత సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించింది. – ప్రశాంతి నిలయం:

క్లుప్తంగా

రైలు ఢీకొని మహిళ మృతి



వెంకటలక్ష్మి (ఫైల్)

ధర్మవరం అర్బన్: రైలు ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని రాజేంద్రనగర్‌కుచ ఎందిన దేవరపల్లి వెంకటలక్ష్మి (40), కేశవరెడ్డి దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిలో ఒకరికి వివాహమైంది. ఓ ప్రైవేట్ పాఠశాల బస్సుకు క్లీనర్‌గా కేశవరెడ్డి, ఆకుకూరలు విక్రయిస్తూ వెంకటలక్ష్మి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున గంపలో ఆకుకూరలు పెట్టుకుని లక్ష్మీనగర్ సమీపంలో రైలు వస్తున్న విషయాన్ని గమనించకుండా వెంకటలక్ష్మి పట్టాలు దాటుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. రైలు ఢీకొనడంతో ఆమె తల ఛిద్రమైంది. చేతులు విరిగిపోయి అక్కడికక్కడే మృతి చెందింది. తెల్లవారిన తర్వాత ఘటనను గమనించిన స్థానికుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

పాము కాటుతో వ్యక్తి మృతి



పుట్ట కామప్ప (ఫైల్)

అగళి: పాముకాటుతో ఓ రైతు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... అగళి మండలం హుళికెరె దేవరహల్లికి చెందిన హనుమప్ప కుమారుడు పుట్ట కామప్ప (52) వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం 9 గంటలకు పొలంలో మల్బరీ ఆకు కోస్తున్న సమయంలో పాము కాటుకు గురయ్యాడు. విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపడంతో వారు హుటాహుటిన కర్ణాటకలోని శిర ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. మృతుడికి భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మళ్లీ రాబోయేది జగనన్న ప్రభుత్వమే

- ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు కట్టిపోగు బసవరావు



పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బత్తలపల్లి: త్వరలో జరిగే ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాలను వైఎస్సార్‌సీపీ కై వసం చేసుకోవడం ఖాయమని, రాబోయేది జగనన్న ప్రభుత్వమేనని ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు కట్టిపోగు బసవరావు స్పష్టం చేశారు. ఇడుపుల పాయ నుంచి ఇచ్ఛాపురం వరకూ ఆయన చేపట్టిన పాదయాత్ర బుధవారం బత్తలపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయనకు జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ, వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ ఈడిగ కాశప్ప, కో–ఆప్షన్ సభ్యుడు కరీంసాబ్, నాయకులు బండి వీరనారప్ప, నడిమింటి షేక్షావలి, ఈడిగ కిష్టా, ఎస్సీ సెల్ నాయకులు ముసలప్ప ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎం వైఎస్ జగన్ పాలన పట్ల ఆకర్షితుడినై పోలీస్ ఉద్యోగానికి రాజీనామా చేసి, రాజకీయాల్లోకు వచ్చినట్లు పేర్కొన్నారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలనే సంకల్పంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంక్షేమ పాలనపై ప్రజలను చైతన్య పరిచేందుకు పాదయాత్ర చేపట్టానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జిక్రియా, పరశురాంబాబు, వెంగన్న, ఈశ్వరయ్య, లింగారెడ్డిపల్లి రాఘవ, నడిమింటి షెక్షా తదితరులు పాల్గొన్నారు.

పటిష్టంగా 'ఆహార భద్రత'

- పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వంశీకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న డీఎస్ఓ వంశీకృష్ణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: ఆహార భద్రతా చట్టాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేసేందుకు అన్ని చర్యలూ తీసుకున్నట్లు పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ (డీఎస్ఓ) వంశీకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆహార భద్రత చట్టం అమలు అంశంపై వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విజిలెన్స్ సంఘం సమావేశంలో ఆయనతో పాటు డీఎంలు సింధు, అశ్వత్థ నారాయణనాయక్, ఫుడ్ సేఫ్టీ అధికారి రామచంద్ర, తూనికలు కొలతలు శాఖ అధికారి సుధాకర్, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు శివరంగప్రసాద్, మోహన్‌రామ్, నిర్మలాజ్యోతి తదితరులు ప్రసంగించారు. ఆహార భద్రత చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తుండడం వల్లనే లబ్ధిదారులకు రేషన్ పంపిణీ సక్రమంగా జరుగుతోందన్నారు. వినియోగదారుల రక్షణ చట్టంపై ప్రజల్లో అవగాహన పెంపొందిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎవరికైనా ఎలాంటి సమస్య వచ్చినా తమకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. జిల్లాలో 38 గ్యాస్ ఏజెన్సీల ద్వారా 8,08,489 లక్షల మంది లబ్ధిదారులకు వంట గ్యాస్ సరఫరా చేస్తున్నామన్నారు. ఉజ్వల్ పథకం కింద 11,335 కనెక్షన్లు ఉన్నాయన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ వరకూ మొత్తం 5,303 రేషన్ కార్డులను అర్హులకు పంపిణీ చేసినట్లు వివరించారు. 312 వినియోగదారుల క్లబ్‌ల నేతృత్వంలో విజిలెన్స్ విభాగం, తహసీల్దార్ల ఆధ్వర్యంలో రేషన్ అక్రమ రవాణపై తనిఖీలు చేపట్టి 84 కేసులు నమోదు చేసి రూ.5,56,854 అపరాధ రుసుం వసూలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, విద్యాశాఖ ఏడీ రామకృష్ణ, సభ్యులు వెంకటరమణారెడ్డి, గుడిబండ జెడ్పీటీసీ రామాంజనేయులు, సూర్యనారాయణ, ఫుడ్ కమిటీ సభ్యుడు డాక్టర్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనవాక్కు

మేలు మరువం



మాది నిరుపేద కుటుంబం. నా భర్త ఎనిమిదేళ్ల క్రితం మృతి చెందారు. ముగ్గురు సంతానం. ఇద్దరు ఆడపిల్లలకు పెళ్లి చేసి అత్తారింటికి పంపా. కొడుకు, కోడలితో కలిసి ఉంటున్నా. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మా కష్టాలు తీరాయి. నెలనెలా పెన్షన్ డబ్బు అందుతోంది. దీంతో పాటు వైఎస్సార్ చేయూత కింద నాలుగున్నరేళ్లుగా లబ్ధి పొందుతున్నా. సీఎం జగన్ చేసిన మేలును మర్చిపోను.

– ప్యారియా షేక్, ఎం.రాయాపురం గ్రామం, రొళ్ల మండలం

జీవనోపాధి మెరుగు



కూలి పనులతో జీవనం సాగిస్తున్నాం. ఎన్నో సార్లు పనులు దొరక్క పస్తులతో పూట గడపాల్సి వచ్చింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పది మంది సభ్యులుగా ఉన్న మా సంఘానికి తొలి విడత రూ.2 లక్షలు, రెండో విడత రూ.4 లక్షల రుణం మంజూరైంది. నాకు రూ.20 వేలు రాగా.. మిగిలిన మొత్తాన్ని స్వయం సహాయక నిధి నుంచి రుణంగా తీసుకుని ఓ పాడి ఆవును కొన్నా. పాలు డెయిరీకి వేస్తూ బ్యాంక్ రుణం సక్రమంగా చెల్లిస్తున్నా. ఇంట్లో డబ్బు సమస్య తీరింది. జీవనోపాధి మెరుగుపడింది.

– ఆదిలక్ష్మమ్మ, మరువకొత్తపల్లి, చిలమత్తూరు మండలం

పేదల పెన్నిధి



పేదల బతుకు గురించి గతంలో ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదు. సీఎంగా వైఎస్ జగనన్న బాధ్యతలు తీసుకున్న తర్వాత అమలవుతున్న వివిధ పథకాలతో మా పేదల బతుకులు ఎంతో బాగుపడ్డాయి. కూలి పనులతో పొట్ట పోసుకుంటున్న మాకు ఇద్దరు పిల్లల చదువుల కోసం గతంలో నానా ఇబ్బందులు పడ్డాం. అమ్మ ఒడి పథకంతో మా పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పిస్తున్న పేదల పెన్నిధి వైఎస్ జగనన్న పది కాలాల పాటు చల్లగా ఉండాలి.

– గంతి కొండమ్మ, రామాపురం, తాడిమర్రి మండలం

ఉపాధి దొరికింది



మాది సామాన్య వ్యవసాయ కుటుంబం. ఆదాయం అంతంత మాత్రమే. పాత ఇంట్లోనే జీవనం సాగిస్తున్నాం. ఎన్నో ఆర్థిక ఇబ్బందులతో బతుకు నెట్టుకొస్తున్నాం. ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారికి లేపాక్షి నవోదయాలో సీటు రావడంతో కాస్త వెసలుబాటు కలిగింది. డ్వాక్రా గ్రూపులో సభ్యురాలిగా ఉండడంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పాత బకాయిలు విడతల వారీగా రద్దు చేస్తూ వచ్చారు. అంతేకాక బ్యాంకులో రూ.50 వేలు రుణం తీసుకుని చిల్లర దుకాణం ఏర్పాటు చేసుకున్నా. నా భర్త వేణు రెడ్డి సహకారంతో ఉదయం, సాయంత్రం పాల వ్యాపారం మొదలు పెట్టా. ఇప్పుడిప్పుడే కాస్త ఆర్థిక ఇబ్బందులు దూరమవుతున్నాయి. సీఎం వైఎస్ జగన్‌తోనే మా కుటుంబంలో కష్టాలు దూరమయ్యాయి. ఆయన రుణం తీర్చుకోలేనిది.

– రాజమ్మ, మరవకొత్తపల్లి, చిలమత్తూరు మండలం

మిస్సింగ్ కేసు నమోదు



ధనుష్ నాయక్, శశాంక్ నాయక్

కదిరి అర్బన్: తన పిల్లలు కనిపించడం లేదంటూ గాండ్లపెంట మండలం పెద్దతండాకు చెందిన శ్రీనివాసులునాయక్ ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. శ్రీనివాసులు నాయక్, విజయకుమారి దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. వీరిలో ధనుష్‌నాయక్ నల్లమాడ మండలం ఆశ్రమ పాఠశాలలో 7వ తరగతి, శశాంక్‌నాయక్ 5వ తరగతి చదువుతున్నారు. గత శని, ఆదివారాలు సెలవు రోజులు కావడంతో స్వగ్రామానికి చేరుకున్న వారు ఈ నెల 12న ఆశ్రమ పాఠశాలకు పంపించేందుకు తల్లి కదిరి బస్టాండ్‌కు చేరుకుంది. తాము పాఠశాలకు వెళ్తామని పిల్లలు చెప్పడంతో వారిని బస్టాండులో వదిలి ఆమె స్వగ్రామానికి తిరిగి వెళ్లింది. అనంతరం పిల్లలు పాఠశాలకు చేరుకున్న విషయంపై స్కూల్ టీచర్‌కు ఫోన్ చేసి అడగడంతో రాలేదని తెలపడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. విద్యార్థుల ఆచూకీ తెలిసిన వారు 94407 96851కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆటో డ్రైవర్‌కు జైలు శిక్ష

గుత్తి: నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ఒకరు మృతి చెందడానికి, మరొకరు తీవ్రంగా గాయపడటానికి కారణమైన ఆటో డ్రైవర్‌కు 19 నెలల జైలు శిక్ష పడింది. ఈ మేరకు గుత్తి జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి డి.దీప్తి బుధవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. 2015 నవంబర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తన తల్లి సుంకమ్మ చనిపోయిందని, ఇదే ఘటనలో ఈశ్వరమ్మ కూడా గాయపడిందని పెద్దవడుగూరు మండలం మేడిమాకులపల్లికి చెందిన సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే నెల 28న పెద్దవడుగూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి ఎస్‌ఐ రమణారెడ్డి దర్యాప్తు పూర్తి చేసి.. నివేదికను కోర్టుకు సమర్పించారు. ఈ కేసును జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి దీప్తి సమగ్రంగా విచారించారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల ప్రమాదం జరిగిందని నిర్ధారించి ఆటో డ్రైవర్ రామాంజనేయులుకు 19 నెలల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు. అప్పటి దర్యాప్తు అధికారితో పాటు ప్రస్తుత ఎస్‌ఐ డి.శ్రీనివాసులు, ఏపీపీ హరిప్రసాద్, కోర్టు కానిస్టేబుల్ మారుతీప్రసాద్‌ను ఎస్పీ అన్బురాజన్ అభినందించారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కంజాక్షన్

హిందూపురం: స్థానిక డీబీ కాలనీ శ్మశాన వాటిక వద్ద లేపాక్షికి చెందిన డ్రైవర్ బాలాజీ హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, ఓ ద్విచక్ర వాహనంతో పాటు, హతుడి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు హిందూపురం డీఎస్పీ కంజాక్షన్ బుధవారం వెల్లడించారు. హిందూపురంలోని రహమత్‌పురం సర్కిల్ వద్ద ఈ నెల 6న బస్సు కోసం వేచి ఉన్న బాలాజీతో లక్ష్మీపురానికి చెందిన తిరుమలేష్, విద్యానగర్ నివాసి భజంత్రీ కళ్యాణ్‌కుమార్, శ్రీకంఠపురానికి చెందిన రవీంద్రారెడ్డి మాట కలిపారు. తాము కూడా లేపాక్షి వైపే వెళుతున్నామని నమ్మించి తమతో పాటు ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని బయలుదేరారు. డీబీ కాలనీ శ్మశాన వాటిక వద్దకు చేరుకోగానే బాలాజీ తలపై ఇటుకలతో దాడి చేసి అతని వద్ద ఉన్న మొబైల్ ఫోన్, డబ్బులు లాక్కొని వెళ్లిపోయారు. తీవ్ర గాయాలతో ఇంటికి చేరుకున్న బాలాజీని కుటుంబసభ్యులు వెంటనే కర్నూలులోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఈ నెల 7న బాలాజీ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన వన్‌టౌన్ సీఐ శ్రీనివాసులు, బుధవారం ఉదయం నిందితులను గుర్తించి అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

రాజీనామా ఉపసంహరణ



ఎమ్మెల్యే శంకరనారాయణను కలిసిన చెర్లోపల్లి మారుతీరెడ్డి, తదితరులు

పరిగి: పార్టీ అభీష్టం మేరకు నడుకుంటూ వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి చేస్తానని సింగిల్ విండో అధ్యక్షుడు చెర్లోపల్లి మారుతీరెడ్డి అన్నారు. అనివార్య కారణాలతో పాటు వ్యక్తిగత ఇబ్బందుల కారణంగా పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు మంగళవారం ప్రకటించిన ఆయన ఇదే అంశంపై బుధవారం విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీతోనే తనకు గుర్తింపు వచ్చిందన్నారు. రాజీనామాను ఉపసంహరించుకుంటున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే శంకరనారాయణను కలసి తన నిర్ణయాన్ని వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి ప్రభాకర్, జెడ్పీటీసీ శ్రీరామప్ప, ఎంపీటీసీలు నారాయణరెడ్డి, హనుమంతు, నరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ అంజి, చిక్కన్న, మాజీ కన్వీనర్ జయరాం, కోఆప్షన్ సభ్యుడు సలీం తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో జేఎల్‌ఎం మృతి



నరేష్‌రెడ్డి (ఫైల్)

గుత్తి: పెద్దవప్పూరు మండలం కుమ్మెత గ్రామంలో బుధవారం విషాదం చోటు చేసుకుంది. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫీజ్ వేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై జూనియర్ లైన్‌మన్ నరేష్‌రెడ్డి(28) మృతి చెందాడు. వివరాలు... కుమ్మెత గ్రామంలో రైతు తిరుపాల్‌కు చెందిన పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫీజు పోయింది. బుధవారం ఉదయం సమాచారం అందుకున్న జేఎల్‌ఎం నరేష్‌రెడ్డి అక్కడకు చేరుకుని జూటూరు విద్యుత్ సబ్ స్టేషన్‌కు ఫోన్ చేసి ఎల్‌సీ అడిగాడు. అనంతరం ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కి ఫీజు వేస్తుండగా విద్యుత్ ప్రసారం జరిగి షాక్ గురై కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన నరేష్‌రెడ్డిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ

కనగానపల్లి: ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో కనగానపల్లి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు యోగా గురువు సుబ్బరాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కనగానపల్లి ఆదర్శ, కేజీబీవీ, జెడ్పీ పాఠశాలలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. వీరిలో లావణ్య, హరిత, వంశిక, శ్రావ్య, హరిప్రియ, స్నేహ పతకాలు సాధించారన్నారు.

రెండిళ్లలో చోరీ

ధర్మవరం రూరల్: మండలంలోని పోతుకుంట బృందావన కాలనీలో మంగళవారం రాత్రి రెండిళ్లలో చోరీ జరిగింది. వడ్డే కొండా ఇంట్లో రూ.1.30 లక్షలతో పాటు 2 తులాల బంగారు నగలు, సుజాతమ్మ ఇంట్లో రెండున్నర తులాల బంగారం, కాలి గొలుసుతో పాటు రూ.వెయ్యి అపహరించుకెళ్లారు. తన భార్యను వైద్య చికిత్సల కోసం మంగళవారం ఇంటికి తాళం వేసి అనంతపురానికి పిలుచుకెళ్లానని, తిరిగి వచ్చే లోపు తాళం బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించిన దుండగులు బీరువాలోని సొత్తును అపహరించుకెళ్లారంటూ బాధితుడు కొండా వాపోయాడు. అలాగే ఇంటికి తాళం వేసి గౌర్లెను సుజాతమ్మ మేపునకు తోలుకెళ్లినప్పుడు దుండగులు లోపలకు చొరబడి చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ రెండు ఇళ్లతో పాటు మరో మూడు ఇళ్లలో చోరీకి విఫలయత్నం జరిగింది. సీసీ కెమెరా ఫుటేజీల్లో ముఖానికి ముసుగులు ధరించిన వారు తచ్చాడినట్లు కనిపిస్తోంది. విషయం తెలుసుకున్న సీఐ ఆరోహణరావు, ఎస్‌ఐ విజయ్‌కుమార్ నాయక్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. స్నిఫ్పర్ డాగ్‌ను రంగంలో దించి ఆధారాల కోసం గాలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ.15 లక్షల విలువ చేసే బంగారు నగల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జీఆర్‌పీ డీఎస్పీ అబ్దుల్‌అజీజ్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న రైల్వే పోలీసులు

గుంతకల్లు: రైళ్లలో చోరీలకు పాల్పడే అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసి, రూ.15 లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్పీ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, సీఐ నగేష్‌కుమార్ తెలిపారు. వివరాలను స్థానిక జీఆర్పీ డీఎస్పీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వెల్లడించారు. గుంతకల్లు రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం–7లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వెస్ట్ బెంగాల్‌లోని రాంచీ నగరానికి చెందిన అమరనాథ్ జైస్వాల్ అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో రైల్వే పోలీసులు విచారణ చేయడంతో అసలు విషయం బయటపడింది. రైళ్ల ప్రయాణిస్తూ ప్రయాణికులు అదమరిచి నిద్రిస్తున్న సమయంలో వారి బ్యాగుల్లోని విలువైన బంగారం, నగదు అపహరించేవాడు. ఈ క్రమంలోనే గుంతకల్లు జీఆర్‌పీ పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్ 4, అక్టోబర్ 2న చోరీలు చేశాడు. ఈ కేసుల్లో చోరీ చేసిన మొత్తం 270 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ ప్రస్తుత మార్కెట్ ధర మేరకు దాదాపు రూ.15 లక్షలకు పైగా ఉంటుంది. నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన ఆర్ఎస్ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుల్ సాయిసర్వేశ్వరరావు, కానిస్టేబుళ్లు హుస్సేన్, గాదిలింగ, ప్రకాష్, అలీ, నబీ, ఆర్పీఎఫ్ ఎఎస్ఐ నాగరాజు తదితరులను జీఆర్‌పీ ఎస్పీ చౌడేశ్వరి అభినందించారు.

వ్యాధులపై సర్వే పూర్తి చేయండి

బుక్కరాయసముద్రం: వ్యాధులపై నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఎన్‌హెచ్ఎం నేషనల్ హెల్త్ మిషన్ అధికారి డాక్టర్ రవిశంకర్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. మందుల స్టాక్ వివరాలు ఆరా తీశారు. అసంక్రమిత వ్యాధుల సర్వే లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ స్వాతిలక్ష్మి, తహెరున్నీసా, సీహెచ్ఓ మోహన్‌రావు, పీహెచ్ఎన్ఎం చెన్నమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, కిరణ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తిలో చైన్‌స్నాచింగ్

గుత్తి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును దుండగుడు అపహరించుకెళ్లాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి వివరాలు... ఈ నెల 9న కర్నూలుకు చెందిన జ్యోతిర్మయి గుంతకల్లులో పనిముగించుకుని తిరుగు ప్రయాణంలో గుత్తి బస్టాండ్‌కు చేరుకుంది. బస్సు ఆగిన సమయంలో కిందకు దిగి వాటర్ బాటిల్ కొనుగోలు చేసి బస్సు ఎక్కుతున్న సమయంలో ఓ దుండగుడు ఆమె మెడలోని రెండు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లాడు. వెంటనే బాధితురాలు డయల్ 100కు కాల్ చేయడంతో పోలీసులు అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. కాగా, ఈ ఘటనపై కేసు నమోదు కాలేదు.